సాక్షి
విజయనగరం

శనివారం । 5 । జూలై । 2025

నారుమడికి 'చీర'కట్టు..



ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. కొందరు వెదలు జల్లుతుండగా, మరికొందరు నాట్లువేసేందుకు నారుమడులు సిద్ధం చేశారు. వరినారును పక్షులు, జంతువుల నుంచి రక్షించుకునేందుకు కొందరు రైతులు చీరలనే దడిలా కడుతున్నారు. గుమ్మలక్ష్మీపురం నుంచి గుమ్మవెళ్లే రోడ్డులో ప్రయాణించే వారికి రైతుల నారుమడి రక్షణ చర్యలు కళ్లకుకడుతున్నాయి. – గుమ్మలక్ష్మీపురం



పడగ విప్పుతున్న మహమ్మారి

పార్వతీపురం మన్యం జిల్లాలో మలేరియా మహమ్మారి పడగ విప్పుతోంది. విద్యార్థులనూ ఆస్పత్రులపాలచేస్తోంది. - 8లో

ప్రజారోగ్యంపై
ప్రత్యేక శ్రద్ధ అవసరం

- పీహెచ్‌సీ, సీహెచ్‌సీ భవన నిర్మాణాల్లో జాప్యంతో తప్పని అవస్థలు
- ఎరువులు, విత్తనాల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చించిన జెడ్పీ ఛైర్మన్, సభ్యులు
- తాటిపూడి నీటి మళ్లింపుపై ఎటువంటి చర్చ జరగలేదు: మంత్రి కొండపల్లి



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యలు.. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ భవన నిర్మాణాల పూర్తి.. ఎరువులు, విత్తనాల ధరల నియంత్రణ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుదల.. తదితర అంశాలపై విజయనగరం జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు చర్చించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వవిప్ తోయక జగదీశ్వరి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, శ్యాంప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు. తొలుత అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వైద్యం, వ్యవసాయం, విద్య రంగాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.

విద్యార్థుల తగ్గుదల ఆందోళన కలిగించే విషయం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గడం ఆందోళన కలిగించే విషయమని, సంఖ్య తగ్గకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని జెడ్పీ ఛైర్మన్ కోరారు. ఇటీవల మెరకముడిదాం మండలంలో తనిఖీ చేసినప్పుడు గత ఏడాది కన్నా 1100 మంది తగ్గారని తెలిసిందని, ఒకే మండలంలో ఇంత మంది తగ్గితే జిల్లా అంతటా ఈ సంఖ్య ఎక్కువే ఉంటుందన్నారు. తల్లికి వందనం పథకం కింద ఒక్కోవిద్యార్థి నుంచి కట్ చేసిన రూ.2వేలు పాఠశాలల ఖాతాలకు ఎప్పుడు వేస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల నమోదు తగ్గుదలపై శాస్త్రీయంగా విశ్లేషణ జరగాలని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఈఓకు మంత్రి కొండపల్లి సూచించారు. ఈ నెల 10న మెగా టీచర్ పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ లోపల అడ్మిషన్లు పూర్తి చేస్తామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు.

● ఒకే మంచంపై ముగ్గురు రోగులకు వైద్యమా?

ఏజెన్సీలోని ఆస్పత్రుల్లో ఒకే మంచంపై ముగ్గురు రోగులకు వైద్యం చేస్తున్నారని, కురుపాం సీహెచ్‌సీకి రోగుల తాకిడి పెరుగుతున్నా అవసరమైన భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంలో తాత్సారం చేస్తున్నారంటూ కురుపాం మండల జెడ్పీటీసీ సభ్యురాలు గొర్లె సుజాత, ఎంపీపీ శెట్టి పద్మావతిలు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, కొత్తవలసలో ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడంతో స్థానికంగా ఉన్న ఎన్‌జీఓ హోంలో రోగులకు సేవలందిస్తున్నారని, ఒకే గదిలో రోగులకు తనిఖీలు, ఆపరేషన్లు చేస్తున్నారని జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి సభలో ప్రస్తావించారు. దీనిపై స్పందించిన అధికారులు త్వరలో భవన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో స్కానింగ్ యంత్రాలు ఎందుకు పని చేయడం లేదని అధికారులను ప్రశ్నించారు. సర్వజన ఆస్పత్రి నుంచి విశాఖలో కేజీహెచ్‌కు రిఫరల్ కేసుల సంఖ్య పెరుగుతోందని, ప్రజాప్రతినిధులు ఫోన్ చేసి చెబితే మరింత వేగంగా ఇతర ఆస్పత్రులకు పంపించడం వెనుక అంతర్యమేమటన్నారు. స్పందించిన సూపరింటెండెంట్ కార్డియాలజీ, గ్యాస్ట్రో తదితర అత్యవసర కేసులను తప్పనిసరి పరిస్థితుల్లో రిఫరల్ చేయిస్తున్నామని, ఆస్పత్రుల్లో అన్ని యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనబంధంగా సర్వజన ఆస్పత్రిని మార్పుచేసే ప్రక్రియపై కళాశాల ప్రిన్సిపాల్‌తో చర్చించారు. వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాల వద్దకు ఆస్పత్రిని తరలిస్తే ప్రజలకు దూరం అవుతుందని, అటువైపు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా లేదని, కొన్ని విభాగాలను బోధనాస్పత్రి వద్ద ఏర్పాటు చేసి, పాత ఆస్పత్రినే అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

- అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందించాలని జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను కోరారు. మ్యుటేషన్ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కొందరు రైతులు ఎరువులు, విత్తనాలు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక మొత్తం చెల్లించి కొనుగోలు చేస్తున్నారని, అధిక ధరలకు విక్రయించే వారిపై విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

తాటిపూడి నీటి కోసం ఆందోళన వద్దు

గొర్రిపాటి బుచ్చి అప్పారావు తాటిపూడి జలాశయం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఎంఎస్ఎంఈ పార్కుకు తాటిపూడి నుంచి నీరందించడంపై ప్రభుత్వ చర్చకు రాలేదని మంత్రి కొండపల్లి స్పష్టం చేశారు. దీనిపై జెడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ తాటిపూడి కేవలం సాగు, తాగునీటి ప్రాజెక్టు అని, జిందాల్ సంస్థ స్వయంగా నీటి వసతులు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

- శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ పాఠశాలలకు కంప్యూటర్ ఆపరేటర్లు లేరని, సచివాలయాల నుంచి డిప్యూటేషన్ వేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
- ఉపాధిహామీ పనుల తీర్మానాలపై సభలో చర్చ జరిగింది. గ్రామ సభల్లో తీర్మానించిన వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయకుండా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులు కాలరాస్తున్నారంటూ పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికార బలంతో ఎంపీడీఓలను అడ్డంపెట్టుకుని ఎమ్మెల్యేలు చెప్పిన పనులు చేసుకుంటున్నారని ఆరోపించారు.

డోలీలో ఐదు కిలోమీటర్లు..



పూసనంది గ్రామానికి చెందిన చంద్రమ్మను డోలీలో ఆస్పత్రికి తీసుకెళ్తున్న గిరిజనులు

కొమరాడ: పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం పెదశాఖ పంచాయతీ పరిధిలోని గిరిశిఖర గ్రామం పూసనందికి చెందిన గర్భిణి కొండగొర్రి చంద్రమ్మ శుక్రవారం ఒక్కసారి కళ్లుతిరిగి పడిపోయింది. అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఐదు కిలోమీటర్ల రాళ్లదారిలో డోలీలో పెదశాఖ వరకు తెచ్చి అక్కడ నుంచి ఫీడర్ అంబులెన్స్‌లో కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యంకోసం అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో అద్దెవాహనంలో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. పీహెచ్‌సీలో మెరుగైన వైద్యసేవలందించేందుకు వైద్యులు అందుబాటులో లేరని చంద్రమ్మ బంధువులు ఆరోపించారు.

జిల్లాకు చెందిన సంధ్యారాణి గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా పనిచేస్తున్నా విద్య, వైద్య కష్టాలు తీర్చే 'దారి' చూపడంలేదని గిరిజన సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ జిల్లా వైస్ ఛైర్మన్ మల్లయ్య కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సేవలకు సన్మానం

నెల్లిమర్ల రూరల్: మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ శిల్ప కళావేదికపై ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుకు ఘన సత్కారం లభించింది. ఆంధ్రా, తెలంగాణ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న సురేష్‌బాబును దేశ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సత్కరించారు. సేవలను ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో క్షత్రియ సేవా సమితి సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, యూనియన్ మినిస్టర్లు గజేంద్రసింగ్ సెకావత్, కిషన్‌రెడ్డి, శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ సురేష్‌బాబును సత్కరిస్తున్న దేశరక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, తదితరులు

ఐక్యంగా పోరాడితేనే ప్రభుత్వ సంస్థల మనుగడ

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ

బొబ్బిలి: ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటుపరం కాకండా కార్మిక వర్గం, ప్రజలు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. బొబ్బిలిలో శుక్రవారం జరిగిన సీఐటీయూ మహాసభలో ఆమె మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తోందన్నారు. విశాఖఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ యత్నాలపై కూటమిగా ఉన్న టీడీపీ, జనసేనలు కనీసం ప్రశ్నించడం లేదన్నారు. రైల్వే, ఎయిర్‌పోర్టులను ప్రైవేటీకరణ చేయడం వల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజల సొమ్ముకు రక్షణగా ఉన్న బ్యాంకింగ్ రంగాన్ని కూడా ప్రైవేటీకరించి అన్యాయం చేస్తోందన్నారు. కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికులకు రోజుకు రూ.178 ఇస్తే చాలన్నట్టు పొందుపరిచారన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

లేబర్‌కోడ్ చట్టాలతో కార్మికుల హక్కులకు భంగం కలుగజేస్తున్న బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. స్థానిక గ్రోత్ సెంటర్‌లో కార్మికులతో కలిసి సమ్మెపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి, సీఐటీయూ, రైతు, పెన్షనర్ల సంఘాల జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, శేషగిరి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, ఎండీఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఖాతాలు తెరవండి

విజయనగరం టౌన్: తల్లికి వందనం రెండో విడతలో ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థుల తల్లుల ఖాతాలకు నిధులు జమచేయనున్నట్టు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు యు.అన్నపూర్ణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు బ్యాంకు ఖాతాలను ఆధార్‌నంబర్‌తో లింక్ చేసుకోవాలని సూచించారు.

పరిశ్రమల ఏర్పాటు ఆలోచనే లేదు

- మంత్రి కొండపల్లి



శృంగవరపుకోట: పరిశ్రమలు తెస్తాం.. జిల్లా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తాం అంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలన్నీ ఉత్తుత్తివే అని తేలిపోయింది. ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలోని ఎంఎస్ఎంఈ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదన అసలు ప్రభుత్వం చర్చించనే లేదని ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో తేల్చిచెప్పారు. గత కొన్ని రోజులుగా సాగుతున్న జిందాల్ నిర్వాసితుల పోరాటం, జిందాల్ భూముల్లో ఎంఎస్ఎంఈ పార్క్ ప్రతిపాదన, జిందాల్‌కు తాటిపూడి నీరు సరఫరా వంటి అంశాలను మంత్రి కొట్టిపారేశారు. 'ఈరోజు వరకూ ప్రభుత్వంలో ఎంఎస్ఎంఈ పార్క్‌పై ఎలాంటి చర్చజరగలేదు. దీని పట్ల ప్రజల్లో ఎందుకు భయాందోళనలు సృష్టిస్తున్నారో అర్థంకావడం లేదు. అక్కడ ఎంఎస్ఎంఈ పార్కు ఆలోచనే లేదు. దానికి తాటిపూడి నీరు ఇస్తారా? ఎలా ఇస్తారన్న చర్చ సాగనేలేదు. అదే విషయాన్ని ఇటీవల తాటిపూడిలో వివరించాం. ఇప్పుడు ఎలాంటి ప్రతిపాదనలు చేయడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ ఆధారంగా రైతాంగంలో భయాందోళనలు సృష్టించాల్సిన అవసరం లేదు' అంటూ మంత్రి కుండబద్దలు కొట్టారు. దీంతో బొడ్డవర వద్ద జిందాల్ సేకరించిన భూముల్లో ఎటువంటి కంపెనీలు రావడం లేదని మంత్రి విస్పష్టంగా తేల్చారు. ఇటీవల జిల్లా కలెక్టర్ జిందాల్‌కు వకాల్తా పుచ్చుకుని మాట్లాడటం, ఎమ్మెల్యే లలితకుమారి, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ కలెక్టర్ వాదనకు మద్దతు ఇవ్వడం, నిర్వాసితులకు పోటీగా టీడీపీకి చెందిన నాయకులు కంపెనీలు కావాలంటూ శిబిరాలు నిర్వహించడం వంటి అంశాలను పరిశీలిస్తే... జిల్లాలో ఏం జరుగుతోంది, ప్రభుత్వం మైండ్‌గేమ్ ఆడుతోందా.. ఆడిస్తోందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.





క్లుప్తంగా

కొనసాగుతున్న డ్రైవర్ల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

పార్వతీపురం: అద్దె బస్సుల డ్రైవర్ల నిరసన నాలుగవ రోజు కొనసాగుతోంది. శుక్రవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో గేటు వద్ద నల్ల బ్యాడ్జీలతో డ్రైవర్లు నిరసనలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డివేణు, జి.వెంకటరమణ, బి.సూరిబాబు తదితరులు మాట్లాడుతూ అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించి అద్దె బస్సు డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు. అద్దెబస్సు యజమానులు కవ్వింపు చర్యలకు పాల్పడడం, భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అద్దె బస్సు డ్రైవర్లు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు కేవీ చారి, పీడీ ప్రసాద్, ఎ.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



దీపాల కాంతుల్లో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనులపండువగా జరిపించారు. వెండి మంటపంలో ఉన్న శ్రీ సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేపుచేశారు. అనంతరం దీపాలను వెలిగించి, స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర దీపాల శోభలో సీతారామస్వామికి ఊంజల్ సేవ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి పోలీస్ "వెల్ఫేర్ డే"

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి



పోలీసు సిబ్బంది తెలియజేస్తున్న సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: శాఖాపరమైన సేవల్లో నిత్యం నిమగ్నమై ఉండే పోలీసు సిబ్బంది సమస్యలతోపాటు శాఖాపరంగా ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి నిర్వహించారు. పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బంది, అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, అలాగే సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ తమ సమస్యలను తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాలోని పలువురు పోలీసుశాఖ సిబ్బంది పాల్గొని వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి స్వయంగా తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తనకు చేరిన సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అవకాశం ఉన్నంత మేరకు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹170

పడగ విప్పుతున్న మహమ్మారి

- జిల్లాలో 1264 మలేరియా పాజిటివ్ కేసులు
- సింగిల్ డాక్టర్లతో నడుస్తున్న పీహెచ్‌సీలు
- 14 వైద్యాధికారుల పోస్టులు ఖాళీ
- గ్రామాల్లో వైద్యశిబిరాలు అంతంతమాత్రమే
- దోమల తెరల పంపిణీ నిల్

సీతంపేట/పాలకొండ రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో మలేరియా మహమ్మారి పడగ విప్పుతోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా, అలాగే ఆశ్రమ, వసతిగృహాల్లో జ్వరాల బాధితులతో ఏజెన్సీలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్ ఎక్కువవుతున్నాయి. ఈ సీజన్‌లో జనవరి నుంచి ఇప్పటివరకు వరకు 1264 మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అధికారిక గణంకాలు చెబుతుండగా ఆ సంఖ్య ఇంకా ఎక్కువ ఉండవచ్చని అనధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 42, ఆరోగ్య ఉపకేంద్రాలు 200 వరకు ఉన్నాయి. ముఖ్యంగా పీహెచ్‌సీల్లో పూర్తిస్థాయిలో వైద్యులు ఇద్దరు చొప్పున ఉండాలి. ఒకరు మెడికల్ క్యాంప్ వెళ్లినా, మరొకరు పీహెచ్‌సీలో ఓపీ చూడాలి. 14 మంది వరకు వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో వైద్యసేవలు నామమాత్రంగానే అందుతున్నాయనే ఆరోపణలున్నాయి. రోజుకు ఓపీ 50 నుంచి 100 మధ్య పీహెచ్‌సీల్లో ఉండగా, ఏరియా ఆస్పత్రుల్లో 200 నుంచి 300ల మధ్య ఉంటోంది. మారుమూల గ్రామాల్లో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉంది. పీహెచ్‌సీల నుంచి ఏరియా ఆస్పత్రులకు రిఫరల్ కేసులు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి.



జ్వరంతో బాధపడుతూ పాలకొండ ఏరియా ఆస్పత్రికి వచ్చిన ఇందిరానగర్ కాలనీ వసతిగృహ విద్యార్థులు



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్లు

550 హైరిస్క్ గ్రామాలు..

జిల్లాలో 1250 పైన గిరిజన గ్రామాలున్నాయి. వాటిలో సుమారు 550 గ్రామాలను మలేరియా హైరిస్క్ గ్రామాలుగా ప్రభుత్వం గుర్తించింది. దీనిలో భాగంగా ఈ గ్రామాల్లో మలేరియా కారక దోమల నివారణకు ఐఆర్‌ఎస్ 5శాతం ఏసీఎం ద్రావణాన్ని దశల వారీగా పిచికారీ చేస్తున్నారు. మలేరియా నివారణ శాఖ, వైద్య ఆరోగ్యశాఖ జ్వరాల నివారణ చర్యలు చేపట్టినప్పటికీ మలేరియా మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. జనవరి నుంచి ఇప్పటివరకు 1,31,902 మంది రక్తపూతలు సేకరించగా వాటిలో 1264 మలేరియా పాజిటివ్ కేసులు జూన్ నెలాఖరు వరకు నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రులు, చిన్నచిన్న క్లినిక్‌లు, గ్రామాల్లో నంచి వైద్యులు వంటి వారి వద్దకు వచ్చే మలేరియా పాజిటివ్ కేసులు ఇంతకు రెట్టింపు సంఖ్యలో ఉంటాయి.

కాలం చెల్లిన దోమతెరలు..

దోమతెరల కాలపరిమితి ఐదేళ్లు. అయితే దోమతెరలను ఉతకడం వంటి పనులు చేస్తే మూడేళ్లకే పాడవుతాయని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో దోమతెరలకు కాలం చెల్లాయి. మరికొన్ని చినిగిపోయాయి. ఇప్పటికే పాడైన దోమతెరలను చాలా గ్రామాల్లో చేపలు పట్టడానికి, మొక్కలకు కంచె వేయడానికి వినియోగిస్తున్నారు.

20 వేల మంది అభ్యాసం

ఐటీడీఏ పరిధిలో 47ఆశ్రమపాఠశాలలు, 13 రెసిడెన్షియల్ పాఠశాలలు, మూడు గురుకుల కళాశాలలు, 13 పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలున్నాయి. వాటిలో దాదాపు 20 వేల మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వారికి కూడా దోమతెరలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు వారికి కూడా పంపిణీ జరగలేదు. ఈ సీజన్‌లో దోమల ఉత్పత్తి ఎక్కువగా ఉండడంతో దోమతెరల వినియోగం తప్పనిసరి. ఆడ ఎనాఫిలిస్ దోమ కారణంగా ఫాల్సీఫారం మలేరియా ప్రబలుతోంది. ఇది సెరిబ్రల్ మలేరియాకు దారితీసి గిరిజనుల ప్రాణాల మీదికి వస్తుంది. అయితే దోమతెరలను విస్తృతంగా వాడించడం ద్వారా కొంతవరకు మలేరియాను నియంత్రించవచ్చని వైద్యబృందాలే తెలియ జేస్తున్నప్పటికీ వాటి పంపిణీని మాత్రం ప్రభుత్వ పట్టించుకోవడం లేదు.

జ్వరాల నివారణకు చర్యలు



జ్వరాల నివారణకు విస్తృతంగా చర్యలు చేపట్టాం. 4 లక్షల 50 వేల దోమతెరల కోసం ఇండెంట్ పంపించాం. అవి వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం. పీహెచ్‌సీల్లో మందుల కొరత లేదు. వైద్యపోస్టుల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌వో

భలే మందుల వ్యాపారం..!

- ఆ ఫార్మా కంపెనీ మందులే రాయాలంటూ హుకుం!
- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యులకు సంబంధిత ఉన్నతాధికారి ఫోన్‌లో ఆదేశాలు
- ఆ ఫార్మా కంపెనీ కూటమికి చెందిన ఓ ముఖ్యనేతది కావడం గమనార్హం!
- నాసిరకం మందుల అమ్మకాలతో దోపిడీ ప్రయత్నాలు
- రోగుల ఆరోగ్యంతో వ్యాపారం
- తమపై ఇదేమి రుబాబు అంటున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల వైద్యులు
- జిల్లాలో 25 ప్రైవేటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

'విజయనగరంలో ఉన్న ఓ ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్య సేవ) నెట్‌వర్క్ ఆస్పత్రికి ఆరోగ్యశ్రీకి చెందిన ఓ ఉన్నతాధికారి ఫోన్‌చేసి ఫార్మా కంపెనీకి చెందిన ప్రతినిధి వస్తారు. వారి కంపెనీకి చెందిన మందులే తీసుకోవాలి. రోగులకు వాటినే అందజేయాలి అని ఫోన్‌లో ఆదేశించారు. ఈ ఫోన్ వచ్చిన అర గంటలో సంబంధిత ఫార్మా కంపెనీ ప్రతినిధి, జిల్లాకు చెందిన ఆరోగ్యశ్రీ సిబ్బందిని వెంట బెట్టుకుని ఆస్పత్రికి వెళ్లి మా ఫార్మా కంపెనీలో తయారు చేసిన మందులను ఆరోగ్యశ్రీ రోగులకు ఇవ్వాలని చెప్పారు. చేసేది లేక సంబంధిత ఆస్పత్రి వైద్యులు మిన్నకుండి పోయారు. నాసిరకం, డొల్ల కంపెనీ మందులు రాయాలన్న ఒత్తిడిపై ఇదేమి రుబాబు అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.'



విజయనగరంలోని ఓ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రిలో ఉన్న ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్

విజయనగరం ఫోర్ట్: కూటమి నేతలు ప్రజాసంక్షేమాన్ని, రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టేసి ప్రజలను దోచుకునే పనిలోపడ్డారు. ఇసుక, మద్యం బెల్టు దుకాణాల నుంచి రోగుల ఆరోగ్యాన్ని కుదుటపర్చే మందుల వరకు అన్నింటినీ వ్యాపారంగా మార్చేస్తున్నారన్నది జనం మాట. తాజాగా జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఫోన్‌లో అందిన మౌఖిక ఆదేశాలు దీనికి బలం చేకూరుస్తున్నాయి. ఆరోగ్యశ్రీ రోగుల చికిత్సకు అవసరమయ్యే అన్నిరకాల మందులు కూటమి నేత కంపెనీకి చెందినవే వినియోగించాలని ఆదేశించినట్టు సమాచారం. మా కంపెనీ మందులు కాదని ఇతర కంపెనీల దగ్గర కొనుగోలు చేసేందుకు వీలులేదని తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఇది వైద్యవర్గాలతో పాటు మిగిలిన మందుల కంపెనీల యాజమాన్యాలను కలవరపెడుతోంది.

భారీ దోపిడీకి స్కెచ్...

భారీ దోపిడీకి కూటమి నేత స్కెచ్ వేశారు. ఆరోగ్యశ్రీ (ఎన్‌టీఆర్ వైద్యసేవ) పథకం కింద అధిక శాతం మంది శస్త్రచికిత్సలు, చికిత్స తీసుకుంటారు. జిల్లాలోని 25 ఆరోగ్యశ్రీ ప్రైవేటు నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఏడాదికి 60 వేల నుంచి 80 వేల మంది వరకు సేవలు పొందుతారు. వీరికి మందుల కోసం నెట్‌వర్క్ ఆస్పత్రులు కోట్లాది రుపాయలు వెచ్చిస్తాయి. ఆ మేరకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు నాణ్యతలేని మందులు సరఫరా చేయడం ద్వారా ఏడాదికి రూ.60 కోట్ల నుంచి రూ.80కోట్ల వరకు ఆర్జించవచ్చన్నదే కూటమినేత స్కెచ్ అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సంబంధిత ఫార్మా కంపెనీ నుంచి నెట్‌వర్క్ ఆస్పత్రులకు మందుల సరఫరాకు అంతా సిద్ధం చేసినట్టు తెలిసింది. ఇప్పటివరకు నెట్‌వర్క్ ఆస్పత్రులు వారి ఆస్పత్రుల్లో అందించే వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులను వారికి నచ్చిన ఫార్మా కంపెనీల నుంచి తెప్పించుకునేవారు. ఇకపై కూటమి నేతఫార్మా కంపెనీ నుంచి తెప్పించుకోవాల్సిందే.



మందులు

పారాసిట్‌మల్ నుంచి యాంటీ బయోటిక్ వరకు...

జ్వరం తగ్గేందుకు ఉపయోగించే పారాసిట్‌మాల్ మాత్రల దగ్గర నుంచి తలనొప్పి, ఐ డ్రాప్స్, ఇయర్ డ్రాప్స్, యాంటీ బయోటిక్స్, కడుపు నొప్పి, గ్యాస్టిక్ మాత్రలు, ప్రోటీన్ పౌడర్లు, విటమిన్, బి-కాంప్లెక్స్ మాత్రలు, పలు రకాల ఇంజిక్షన్లు, సర్జికల్ మెటీరియల్స్ ఇలా అన్నిరకాల మందులు ఆ ఒక్క కంపెనీ వద్దనే కొనుగోలుచేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆదేశాలు అందాయి. ఆరోగ్యశ్రీకి చెందిన ఉన్నతాధికారుల నుంచి ఫోన్ రావడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులు సంబంధిత ఫార్మా కంపెనీ చెప్పిన మందులు కొనుగోలు చేయకపోతే ఏమవుతుందోనని మదనపడుతున్నారు. వారు చెప్పినట్టు చేయకపోతే ఆరోగ్యశ్రీ రోగులకు సంబంధించిన బిల్లులు నిలిపివేస్తారేమోనని భయపడుతున్నారు. మరోవైపు నాణ్యతలేని మందులు రాస్తే రోగులు ఎలా కోలుకుంటారని మదనపడుతున్నారు.

ఆ కంపెనీ కూటమి నేతదే..

ఫార్మా కంపెనీ కూటమికి చెందిన ఓ ముఖ్య నేతది. దీంతో సదరు నేత ఆరోగ్యశ్రీ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి జిల్లాకు చెందిన ఆరోగ్యశ్రీ అధికారుల ద్వారా నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. విజయనగరం జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాలోనూ ఇదే విధంగా నెట్‌వర్క్ ఆస్పత్రులపై ఒత్తిడి తెస్తున్నట్టు వైద్యవర్గాల్లో చర్చసాగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా బలవంతంగా కూటమి నేతలు రుబాబు చేయడం పట్ల నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమానులు ఆవేదన చెందుతున్నారు.

వాస్తవమే...

ఫార్మా కంపెనీకి చెందిన ప్రతినిధి నెట్‌వర్క్ ఆస్పత్రులకు వచ్చిన మాట వాస్తవమే. వారి కంపెనీకి చెందిన మందులను తీసుకోవాలని కోరారు. బలవంతం పెట్టలేదు. – డాక్టర్ కుప్పిలి సాయిరాం, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

ధర్నా, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి



ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు పోలీసుశాఖ నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, ఇతర నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు తప్పనిసరిగా పోలీసుశాఖ నుంచి ముందస్తుగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. పోలీసు శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేనిదే ఎలాంటి నిరసనలైనా చేపట్టడం చట్టవిరుద్ధమన్నారు. ఇందుకోసం ముందుగా సంబంధిత డీఎస్పీ ఆఫీస్‌లో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు. పర్మిషన్ లేకుండా ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, సమావేశాలు నిర్వహించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. శాంతియుతంగా వ్యవహరించాలని, విజ్ఞతతో వ్యవహరించి ముందస్తు అనుమతులతోనే ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించుకోవాలని సూచించారు. అలా కాకుండా, చట్టాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తూ ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.

పోలీసు వెల్ఫేర్ డే నిర్వహణ

- సిబ్బంది సమస్యలు తెలుసుకున్న ఎస్పీ



తన చాంబర్‌లో సిబ్బంది సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్ శాఖ ప్రతి శుక్రవారాన్ని సిబ్బంది సంక్షేమానికి కేటాయించింది. ఈ మేరకు వారంలో ఒక్క రోజు 'పోలీసు వెల్ఫేర్ డే' నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఎస్పీ వకుల్ జిందల్ తన చాంబర్‌లో శుక్రవారం వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది సమస్యలపై విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది పనితనం, విధుల్లో ఎదుర్కొంటున్న, ఎదురవుతున్న సమస్యలపై ప్రత్యక్షంగా తన వద్దకు పిలిచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తానని చెప్పారు. వెల్ఫేర్ డే లో సిబ్బంది నుంచి అందుకున్న విజ్ఞాపనలను పరిశీలించారు.అనంతరం, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని సిబ్బందికి హామీ ఇచ్చారు. సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకున్నారు.

VEHICLE FOR SALE

Vehicle no.	Make	Model
AP27UB6831	ASHOK LEYLAND	2014
AP31BW2556	TOYOTA	2012

Contact: 8008088897
SHRIRAM FINANCE LIMITED

మ్యుటేషన్లు త్వరగా పరిష్కరించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాత్సవ



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ

పాచిపెంట: గ్రామసభల్లో వచ్చిన మ్యుటేషన్లను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. ఈ మేరకు పాచిపెంట మండలంలోని మోసూరు గ్రామంలో రెవెన్యూ సమస్యలపై శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు పీఓ హాజరై ఫిర్యాదులను స్వీకరించారు. భూ సవరణలకు సంబంధించి మ్యుటేషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ప్రైవేట్ భూములతో పాటు గ్రామ సరిహద్దులు, నీటివనరులున్న భూములు, పోరంబోకు భూములకు కొలతలు వేసి కచ్చితమైన సరిహద్దులను ఏర్పాటు చేయాలని, తద్వారా రైతులకు, భూ యజమానులకు శాశ్వత మేలు జరుగుతుందన్నారు. రీ-సర్వేలో తప్పులు దొర్లకుండా పక్కాగా నిర్వహించాలని సూచించారు. మృతి చెందిన రైతుల మ్యూటేషన్లపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రవి, ఆర్ఐ రమణారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఒకే మొక్కకు 5 బ్రహ్మకమలాలు

సీతానగరం: మండలకేంద్రానికి చెందిన ఆర్వీ పార్థసారథి నివాసంలో ఒకే మొక్కకు 5 బ్రహ్మకమలాలు పూయడంతో రోడ్డుపై వెళ్తున్న వారంతా వాటిని చూస్తూ ఆస్వాదిస్తున్నారు. మొక్కలప్రియుడైన ఆర్వీ పార్థసారథి నివాసంలో వివిధ రకాల పూల మొక్కలు పెంచుతున్నారు. ఈ ప్రాంతంలో బహ్మకమలం మొక్కలు పుట్టడమే అరుదు. ఒకవేళ పుట్టినా ఒకటి లేదా రెండు పువ్వులు పూయడం పరిపాటి. పార్థసారథి నివాసంలో అరుదైన బ్రహ్మకమలాలు రావడంతో చూపరులంతా ఆశ్చర్యచకితులవుతున్నారు.



పూసిన బ్రహ్మ కమలాలు

కొలకట్టు వీధిలో చోరీ

సాలూరు: పట్టణంలోని కొలకట్టు వీధిలో గల ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు ఫిర్యాదు అందిందని సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, కొలకట్టు వీధిలో నివాసముంటున్న కోట దేవి తమ కుటుంబంతో కలిసి ఈ నెల 2న తీర్థయాత్రల నిమిత్తం ఒడిశాలోని గుప్తేశ్వరం వెళ్లారన్నారు. శుక్రవారం వారు తిరిగి ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళాలు, బీరువా పగులగొట్టి ఉన్నట్లు గుర్తించి బీరువాలో చూడగా 15 తులాల బంగారం, వెండి సామగ్రి పోయాయని ఫిర్యాదు చేశారన్నారు.

అటవీ భూమి ధారాదత్తం



మాట్లాడుతున్న అంజమ్మ

బొబ్బిలి: ఆపరేషన్ కగార్ పేరుతో అంతర్జాతీయ కంపెనీ యజమానులైన అదానీ, అంబానీలకు 9 కోట్ల ఎకరాల అటవీ భూమిని ధారాదత్తం చేసేందుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు కుట్ర చేస్తున్నారని అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ అంజమ్మ, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్‌లు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం బొబ్బిలి పట్టణంలోని మహరాణిపేటలో కామ్రేడ్ గంటి ప్రసాదం 12వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పీకేఎస్ జెండాను ఆవిష్కరించారు. గంటిప్రసాదం స్మారక భవనంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ మావోయిస్టుల రక్షణలో ఉన్న ఆదివాసీలను అడవుల నుంచి తరిమేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేయడం దారుణ మన్నారు. మావోయిస్టులను అంతం చేయడానికి ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటివరకూ సుమారు 550 మంది ఆదివాసీలు, మావోయిస్టులను పట్టుకుని అంతమొందించారని ఆందోళన వెలిబుచ్చారు. అమరవీరుల స్ఫూర్తితో ప్రజలు, ప్రజాసంఘాలు ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలకు సిద్ధం అయ్యేలా ప్రభుత్వాల మీద ఒత్తిడి తేవాలని కోరారు. అభివృద్ధి చెందుతున్న అమెరికా, రష్యా, జపాన్ తదితర దేశాల్లో దేశంలో40 శాతం అడవులుండాలని చట్టాలుచేసి పర్యావరణాన్ని కాపాడుతుంటే మన దేశంలో బ్రిటిష్ సామ్రాజ్య వాదులు దీనికి విరుద్ధంగా చర్యలు తీసుకోవడం దారుణ మని ధ్వజమెత్తారు. మావోయిస్టు కేంద్ర కమిటీ నాయకుడు గంటి ప్రసాదాన్ని అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఉన్నప్పుడు నెల్లూరులో పొట్టన పెట్టుకుందన్నారు. ఇటీవల ఆపరేషన్ కగార్‌పేరుతో నంబాల కేశవరావు, చలపతి, సుధాకర్, గణేష్, రేణుక, అరుణ, గాజర్ల రవి తదితరులను కాల్చి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ, అమిత్‌షా, చంద్రబాబు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు కామ్రేడ్ గంటి ప్రసాదం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సభలో పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి, కామ్రేడ్ అన్నపూర్ణ, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి మెరిగాని గోపాలం, పిల్లా లక్ష్మణరావు, పీకేఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాయితి సత్యం, తమటాల అప్పలనాయుడు, దాసరి వెంకట రమణ, రెడ్డి కుమార్, ప్రజాకళామండలి రాష్ట్ర ప్రతినిధి తూముల సింహాచలం, నల్లి తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ SSC, RRB, Banks & All Competitive Exams, New Batches Started. Surya Academy. Kota Jn., & R&B Jn., Vizianagarm. Cont : 99490 03295 [V- 6761]

ASTROLOGY

■ శ్రీ గాయత్రి జ్యోతిష్యం: మీ హస్త రేఖలు, ముఖ లక్షణం, జాతక చక్రం చూసి సంపూర్ణ జ్యోతిషం చెప్పబడును. పెళ్లి సమస్యలు, ఆర్థిక సమస్యలు, ఉద్యోగం, కుటుంబసభ్యుల సమస్యలు, ప్రేమలో విఫలం, చదువు, ఆరోగ్య సమస్యలు, సంతానం, భార్య భర్త మధ్య గొడవలు. మీకు ఎటువంటి సమస్యలు ఉన్న పరిష్కార మార్గం చూపబడును. VZM. 97017 78711. [V- 2039]

WANTED

■ ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు అనుభవం కలిగిన యువతీ యువకులు కావలెను. అర్హత: డిగ్రీ, జీతం: 20 వేల వరకు. 99084 29239 [G-626]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ కష్టల్లేర్నీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP &డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-15945]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024 [SCA25005931]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్ (13591), విశాఖపట్నం
మెలోడీ సినిమా థియేటర్ ఎదురుగా, సూర్యాబాగ్, విశాఖపట్నం-530020,
ఫోన్: 8332956773, 7095199455, ఇ-మెయిల్: cb13591@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) & 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నం వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చెల్లించవలసిన బకాయి మొత్తంను రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టిన/ఛార్జి చేసిన దిగువ వివరించిన స్థిరాస్తులను తేది 22.07.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయడమైనది. బ్యాంకు వారి పరిజ్ఞానం మేరకు తాకట్టు రుణభారాలు లేని స్థిరాస్తుల వివరములు.

ఇ-వేలం తేది & సమయం: 22-07-2025, మ॥ 3.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపులతో)

ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 22.07.2025, ఉదయం 11.00 గం॥ల లోపు

క్ర. నెం	ఋణగ్రహీత / హామీదారులు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విశాఖపట్నంకు బదిలీ చేయబడినవి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వు ధర	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	M/s. నందా అండ్ కో, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ దేవర వెంకట కాశీ సూర రాజు, తండ్రి: డి అప్పారావు	రూ. 742.60 లక్షలు	ఆస్తి-1: విశాఖపట్నం జిల్లా, పోరవరం ఎస్ఆర్ఓ, పోరవరం మండలం మరియు గ్రామం, వార్డ్ నెం.2, బ్లాక్ నెం.2, ఎస్.నెం. 153/2, నేమీద డి.నెం.2-11, పట్టా నెం.21204, ఎ. 0.15 సెంట్లు లేదా 0.060 హెక్టార్లు లేదా 726 చ॥గ॥ బరాయితీ మెట్ట. హద్దులు డీడ్ ప్రకారం.	రూ. 13.00 లక్షలు	రూ. 1.30 లక్షలు
			ఆస్తి-2: నెల్లిమర్ల సబ్- జిల్లా, నెల్లిమర్ల మండలం, కొండ గుంపం పంచాయితీ, కొండ గుంపం గ్రామం, ఎల్‌పి.నెం.33/2007/V1, ఎస్.నెం. 98p, 99p, 116p, 100/1p, ప్లాట్ నెం.134, 135 మరియు 208, మొత్తం విస్తీర్ణం 926.57 చ॥గ॥. హద్దులు డీడ్ ప్రకారం.	రూ.18.76 లక్షలు	రూ.1.88 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 15.07.2025, ఉ॥ 11.00 గం॥ల నుండి సా॥4.00 గం॥ల వరకు.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనలకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్ ఎ.ఆర్.ఎం బ్రాంచ్, విశాఖపట్నం అధీకృత అధికారి గారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించగలరు. ఫోన్: 8332956773, 7095199455.

రిజర్వు ధరలో 10% ధరావత్తును ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్‌ఫర్ ద్వారా కెనరా బ్యాంక్, ఎ.ఆర్.ఎం, విశాఖపట్నం బ్రాంచ్ వారి ఖాతా నెం. 209272434, ఐ.ఎఫ్.ఎస్.సి కోడ్: CNRB0013591 కు తేది: 22.07.2025, ఉ॥ 11:00 గం.ల లోపుగా చెల్లించవలెను.
* బ్యాంకుకు తెలిసిన/తెలియని బకాయిలు/టాక్స్‌లు ఏవైనా ఉన్నచో అవి వేలం కొనుగోలుదారే భరించాలి మరియు తుది బిడ్ మొత్తంతోపాటు అవి కూడా చెల్లించవలసి ఉంటుంది. బిడ్డర్లు తమ ఆఫర్‌లను, ఆస్తి రిజర్వు ధర 25 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 10,000/- గుణింపులో హెచ్చించవలెను. రిజర్వు ధర 25 లక్షల నుండి 100 లక్షల వరకు ఉన్నవాటికి రూ. 25,000/- గుణింపులో హెచ్చించవలెను మరియు రిజర్వు ధర 100 లక్షల కన్నా ఎక్కువ ఉన్నట్లయితే రూ. 50,000/- గుణింపులో హెచ్చించవలెను. 'ఆన్‌లైన్' వేలం ముగిసేలోపు అత్యధిక బిడ్ (రిజర్వు ధర కన్నా ఎక్కువ) సమర్పించిన బిడ్డర్ విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడతారు.
ఇ-వేలం విధానం, నియమ నిబంధనల కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్. పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com, హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 03.07.2025, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్